క్లుప్తంగా

తెలుగుగంగ కాల్వకు నీటి విడుదల



తెలుగుగంగ ప్రధాన కాల్వలో పారుతున్న నీరు

రుద్రవరం: ప్రజల తాగు, సాగు అవసరాల నిమిత్తం వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగుగంగ కాల్వకు మంగళవారం దాదాపు 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. అక్కడి నుంచి ప్రధాన కాల్వతో పాటు ఉప ప్రధాన కాల్వల్లో పారుతూ బుధవారం నాటికి రుద్రవరం సమీపాన నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న గండ్లేరు(తుండ్లవాగు) రిజర్వాయరులోకి చేరింది. కాల్వల ద్వారా నీరు అందుబాటులోకి రావడంతో రైతులు రబీలో సాగు చేసిన వరి, మొక్కజొన్న, మినుము పంటలకు నీటి తడులు పారించుకుంటున్నారు. ప్రస్తుతం నీరు విడుదల చేయడం ఎంతగానో ఉపయోగ పడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న సిమెంట్ రోడ్ల పనులు



కొనసాగుతున్న సిమెంట్ రోడ్ల పనులు

శిరివెళ్ల: మండల కేంద్రంలో అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. రూ.13 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో కటిక సెంటర్ నుంచి కారాలపేట, బ్రహ్మంగారి గుడి, మంగలిపేట మీదుగా సిమెంట్ రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దాదాపు 25 ఏళ్ల కితం వేసిన రోడ్డు దెబ్బతినింది. ప్రస్తుతం రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతుండటంతో ఆయా వార్డుల ప్రజల సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భూమి పూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: మండలంలోని ఇంజేడు గ్రామంలో లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం ముఖ ద్వారం వద్ద రూ.60 లక్షలతో చేపట్టనున్న గాలి గోపురం నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ చేశారు. ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గజ్జెల క్రిష్టారెడ్డి రూ.20 లక్షలతో పాటు రూ.40 లక్షలు విరాళాలు సేకరించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో గజ్జెల క్రిష్టారెడ్డితో పాటు బోడెమ్మనూరు సింగిల్‌విండో చైర్మన్ పోచా వెంకటరెడ్డి, ఈఓ చంద్రుడు, ఆలయాల ధర్మకర్త శీలం హరిశ్చంద్రనాగిరెడ్డి, విజయ డెయిరీ గ్రామ ప్రెసిడెంట్ కామిరెడ్డి విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేలంపాటలు




వేలం పాటలను నిర్వహిస్తున్న అధికారులు

శిరివెళ్ల: స్థానిక మేజర్ పంచాయతీ మార్కెట్ల బహిరంగ వేలం పాటలు బుధవారం సర్పంచు సాలమ్మ అధ్యక్షతన ముగిశాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి వారం సంత, దిన, కబేళాకు వేలంపాటలు నిర్వహించగా రూ.16.18 లక్షలకు పాట దారులు దక్కించుకున్నారు. ఇన్‌చార్జ్ డీపీఓ గంగాధర్, వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, ఉప సర్పంచు ఇంతియాజ్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చాగలమర్రి: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గురువారం ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు పాల్గొననున్న ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



డబ్ల్యూ గోవిందిన్నె పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ

డోర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె, డబ్ల్యూ గోవిందిన్నె, చాకరాజువేముల, డోర్నిపాడు పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి పరిశీలించారు. కేంద్రాల్లో వెంటిలేషన్, విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలపై తహసీల్దార్ నాగరాజుతో ఆరా తీశారు. దివ్యాంగ ఓటర్ల కోసం అన్ని కేంద్రాల్లో ర్యాంప్‌లను పరిశీలించారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. ఆయన వెంట మండల సర్వేయర్ మల్లయ్య, వీఆర్‌ఓలు నాగేష్, రేవనూరు, మురళీమోహన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గోవిందపల్లె-ఇసుకపల్లె రహదారికి మోక్షం

- రూ.5.50 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ముమ్మరంగా సాగుతున్న పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

గోవిందపల్లె-ఇసుక పల్లె రహదారికి మోక్షం లభించింది. దశాబ్దాలుగా వెంటాడుతున్న ఈ సమస్య త్వరలోనే తొలగిపోనుంది. ప్రభుత్వం రూ.5.50 కోట్లు మంజూరు చేయడంతో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రోడ్డు పనులు పూర్తయితే ఇక తమకు కష్టాలు తొలగినట్లేనని ఆ దారిలో రాకపోకలు సాగించే ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి, బిజేంద్రారెడ్డి (ఫైల్)

శిరివెళ్ల: మండలంలోని గోవిందపల్లె, చెన్నూరు, ఇసుక పల్లె గ్రామ పొలాల మధ్య మట్టి రోడ్డు ఉండేది. తెలుగు గంగ కాల్వ తవ్వక ముందు ఆయా గ్రామాల రైతులు మెట్ట పంటలు సాగు చేసేవారు. అయితే తెలుగు గంగ కాల్వ నిర్మాణం పూర్తి కావడం, సాగునీరు రావడంతో రైతులు వరి సాగు చేస్తున్నారు. సాగు నీరు ప్రవాహంతో ఉన్న మట్టి రోడ్డు ఏడాడికేడాది దెబ్బ తినడం మొదలైంది. చివరికి ఎద్దుల బండ్లు పొలాలకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉండేది. రోడ్డు అభివృద్ధి చేయాలని రైతులు పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విషయాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రోడ్డు నిర్మాణానికి రూ.5.50 కోట్లు మంజూరు చేశారు. టెండర్ పూర్తయి గత నెలలో రోడ్డు పనులకు గోవిందపల్లె వద్ద భూమి పూజ చేశారు. ప్రస్తుతం పనులు చకచకా జరుగుతున్నాయి.



గోవిందపల్లె-ఇసుక పల్లె రోడ్డు పనులు

రోడ్డు కష్టాలు తప్పాయి



ఇసుకపల్లె రోడ్డులో మాకు 3 ఎకరాల పొలం ఉంది. ఇంతకు ముందు మేం మెట్ట పంటలు వేసే వాళ్లం. తెలుగు గంగ నీరు రావడంతో రోడ్డు వెంట పోవాలంటే ఇబ్బందిగా ఉండేది. నడవడానికి ఇబ్బందిగా ఉండే రోడ్డుపై రైతులందరు కలిసి చందాలు వేసుకొని దెబ్బతిన్న చోట బాగు చేసుకునేవాళ్లం. రూ.4 లక్షలు చందాలు వేసుకొని బాగు చేసుకున్నాం. ఇప్పుడు తారు రోడ్డు మంజూరు కావడంతో రోడ్డు కష్టాలు తప్పాయి.

– **లింగారి బాలిరెడ్డి**

సంతోషంగా ఉంది



గోవిందపల్లె- ఇసుకపల్లె రస్తాలో దాదాపు 2 వేల ఎకరాల వ్యవసాయ భూములున్నాయి. 700 మంది రైతులు ఉన్నారు. మాకు ఆ రస్తాలో 3 ఎకరాలు ఉంది. రోడ్డు పూర్తిగా దెబ్బతిని పోయింది. ఈ ప్రభుత్వంలో తారు రోడ్డు వేయడం ఎంతో సంతోషంగా ఉంది. అభివృద్ధి జరుగుతుంది. ప్రభుత్వం రైతులకు చాలా మేలు చేస్తుంది. పురాతన రోడ్లు కూడా నేడు అభివృద్ధి చెందుతున్నాయి.

– **ఉశేనిరెడ్డి, రైతు, గోవిందపల్లె**

పనులు వేగంగా జరుగుతున్నాయి

గోవిందపల్లె- ఇసుకపల్లె రోడ్డు పనులకు ప్రభుత్వం రూ.5.50 కోట్ల మంజూరు చేసింది. 7 కిలో మీటర్ల పొడవు, ఏడున్నర మీటర్ల వెడల్పుతో తారు రోడ్డు వేస్తున్నాం. రెండు నెలల్లో రోడ్డు పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. వర్షాకాలం నాటికి రైతులకు రోడ్డు అందుబాటుల్లోకి వస్తుంది.

– **విజయకుమార్, పీఆర్ ఏఈ**

10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు



సాంస్కృతిక కార్యక్రమాలతో అలరిస్తున్న విద్యార్థులు

రుద్రవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఉచిత వైద్య శిబిరం



ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గోస్పాడు: మహానంది వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో మండలంలోని కానాలపల్లె గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు గోపాల్, శ్రీనివాసులు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు చేశారు. గ్రామంలోని 21 మంది రైతుల పొలాల్లో మట్టి, నీటి నమూనాలు సేకరించారు. భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ డాక్టర్ సంతోష్ కుమార్ నాయక్, డాక్టర్ సరోజినిదేవి పాల్గొన్నారు.

పాతపట్టణాన్ని తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): పాత పట్టణాన్ని సుందరంగా తీర్చి దిద్దుతున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక 1వ వార్డులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిని చూసిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గుర్తుకు రావాలన్నారు. ప్రతి కాలనీలో సీసీ రోడ్లు, డ్రైన్లు వేశామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలకు పరిష్కారాన్ని చూపుతున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తుంటే టీడీపీ దుష్ప్రచారానికి తెరలేపిందన్నారు. ప్రజలు గమనించి వచ్చే ఎన్నికల్లో టీడీపీకి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, వైస్ చైర్మన్ పాంషావలి, పట్టణ అధ్యక్షుడు పున్నా శేషయ్య, కౌన్సిలర్ సాదిక్‌బాషా, నాయకులు దేశం సుధాకర్‌రెడ్డి, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ కౌన్సిలర్ మునయ్య, కన్నమ్మ, ఎర్రన్న, తిమ్మరాజు, ఓబులేసు, బాబు, జయకుమార్, మధుబాబు, సాయిబాబ, బోడెన్న అర్జున్, శేఖర్, నాగేంద్ర పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి



ఎమ్మెల్యే రవికి కృతజ్ఞతలు తెలుపుతున్న దివ్యాంగులు

టైలర్ల సంక్షేమానికి కృషి

నంద్యాల(అర్బన్): టైలర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే శిల్పా రవి తెలిపారు. మునిసిపల్ హైస్కూల్ సమీపంలోని గుర్రాల పేటలో బుధవారం ది నంద్యాల జిల్లా మగ్గం వర్క్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేతి వృత్తులవారికి ఆర్థిక సాయం అందించి వ్యాపారంలో మరింత అభివృద్ధి సాధించేందుకు తోడ్పాటు అందిస్తుందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

సమావేశంలో కౌన్సిలర్ తమీమ్, కో ఆప్షన్ మెంబర్ సలాముల్లా, మహమద్ రఫీ పాల్గొన్నారు.

ట్రైసైకిళ్ల పంపిణీ

నంద్యాల(అర్బన్): గోస్పాడు మండలం పసురుపాడు గ్రామానికి చెందిన ఇద్దరు దివ్యాంగులకు ఎమ్మెల్యే శిల్పా రవి బుధవారం తన స్వగృహంలో ట్రైసైకిళ్లను అందజేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గతంలో పసురపాడు గ్రామ పర్యటనలో దివ్యాంగులు కారపాకులు హరి, లక్ష్మన్న తమకు ట్రైసైకిళ్లు కావాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధులతో కొనుగోలు చేసి స్వగృహానికి పిలిపించి అందజేయడంతో దివ్యాంగులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు భక్తవత్సలరెడ్డి, ప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందాం

నంద్యాల(అర్బన్): నిరుపేదలకు ఇల్లు నిర్మించి ఇచ్చిన జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని రాష్ట్ర దృశ్యకళల అకాడమీ డైరెక్టర్ సునీతా అమృతరాజ్ తెలిపారు. పట్టణంలోని 21వ వార్డు నూనెపల్లె పేదలకు రిజిష్టర్ ఇళ్ల పట్టాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొంతింటి కల నెరవేరుస్తామని చెప్పిన మాట నిలబెట్టుకుంటూ అక్కచెల్లెమ్మలకు శాశ్వత భూహక్కు రిజిష్టర్ దస్తావేజులు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మంచి చేసినవారిని ప్రజలు ఆదరిస్తారని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని, నంద్యాలలో శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డిని గెలిపించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అమృతరాజ్, శేషగిరిరావు, రాజారాం, ప్రతాప్, భాస్కర్, కాశీ పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో డైరెక్టర్ సునీత అమృతరాజ్

ఇళ్ల పత్రాలు సిద్ధం



నూతన ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు

డోర్నిపాడు: ప్రభుత్వం పేదలకు ఇదివరకే ఇళ్ల పట్టాలను మంజూరు చేసింది. వారికి భవిష్యత్‌లో ఇబ్బందులు కలుగకుండా సర్వహక్కులను కల్పిస్తూ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి, ఇంటి స్థలహక్కు పత్రాలను సిద్ధం చేసింది. అమ్మిరెడ్డి నగరం 8, అర్జునాపురం 45, బుర్రారెడ్డిపల్లె 38, చాకరాజువేముల 99, డోర్నిపాడు 127, గుండుపాపల4, కొండాపురం 24, క్రిష్టిపాడు 27, డబ్ల్యూ కొత్తపల్లె12, డబ్ల్యూ గోవిందిన్నె 49 చొప్పున ఇళ్ల పత్రాలు మంజూరైనట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు.

ఆటో డ్రైవర్‌కు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మద్యం తాగి ఆటో నడిపిన ఓ వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామ్ రెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి బుధవారం జైలు శిక్ష ఖరారు చేసినట్లు మహానంది పోలీసులు తెలిపారు. పొన్నాపురం కాలనీకి చెందిన దూదేకుల నూరుబాషా మహానంది తెలుగుగంగ కట్ట వద్ద మద్యం తాగి ఆటో నడుపుతూ వెళ్తుండగా మహానంది పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. అతడిని జడ్జి రెండు రోజుల జైలు శిక్ష నిందితునికి జైలు విధిస్తూ తీర్పు చెప్పారని పోలీసులు తెలిపారు.

నీటిని వృథా చేయరాదు

ఉయ్యాలవాడ: గ్రామంలో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీటిని వృథా చేయకుండా ప్రజలు వాడుకోవాలని సర్పంచ్ మేకల ఓబులేసు సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కుందూ నదిలో ప్రవాహం తగ్గిందని, గ్రామంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులను నింపేందుకు సమయం ఎక్కువ పడుతోందన్నారు. వేసవి కాలంలో నీటి అవసరాలు అధికంగా ఉండడం సహజమని, నీటిని పట్టుకున్న తర్వాత కుళాయిలకు బిరడాలు బిగించాలని కోరారు.

‘పీఎం విశ్వకర్మ’ను సద్వినియోగం చేసుకోండి

నంద్యాల: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి సూచించారు. రామకృష్ణ డిగ్రీ కళాశాలలో బుధవారం పథకంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చేతివృత్తులను పునరుద్ధరించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఎంఎస్ఎంఈ సహాయ సంచాలకులు డీపీఎస్ మూర్తి మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూర్చాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చంద్రశేఖర్, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి కమిటీ మెంబర్ కె రాజమహేంద్రనాథ్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, ఎల్‌డీఎం రవీందర్, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ హరిత, అసిస్టెంట్ డైరెక్టర్, పి.నాగకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(సిటీ): మున్సిపల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, వాటర్ కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, గౌస్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి మున్సిపల్ ఇంజినీర్ రమణమూర్తికి వినతి పత్రం అందజేశారు. కార్మికులను స్కిల్, సెమీ స్కిల్డ్ పద్ధతి ద్వారా వేతనాలు అందజేయాలని, కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు, కార్మికులు ఉన్నారు.

ఆశాజనకంగా మినుము సాగు

నంద్యాల (సెంట్రల్): సబ్ డివిజన్ పరిధిలో రబీలో సాగుచేసిన మినుము పంట కోతకు వచ్చింది. నంద్యాల, బండి ఆత్మకూరు, గడివేముల, పాణ్యం బనగానపల్లె, మహానంది మండలాల పరిధిలో 10 వేల ఎకరాల్లో మినుము సాగైంది. మినుముకు ప్రభుత్వం రూ.6,950 మద్దతు ధర ప్రకటించింది. కేసీ, ఎస్ఆర్బీసీ, తెలుగు గంగ కాలువలకు చివరి వరకు సాగునీరు అందించడంతో దిగుబడులు చేతికొచ్చాయి. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దాకా దిగుబడులు వచ్చే అవకాశం ఉండటంతో పాటు, మార్కెట్ ధరలు సైతం ఆశాజనకంగా కనిపిస్తుండటంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

10న మైనారిటీ హక్కుల మహాగర్జన

- ముస్లిం మైనారిటీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మహబూబ్‌బాషా

నంద్యాల(అర్బన్): మైనారిటీల హక్కుల సాధనకు ఈనెల 10న నంద్యాలలో జరిగే మైనారిటీ హక్కుల మహాగర్జనకు తరలిరావాలని ముస్లిం మైనారిటీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మహబూబ్‌బాషా కోరారు. స్థానిక హరున్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 66 వేల ఎకరాల వక్ఫ్ భూముల్లో సగం భూములు ఆక్రమణలకు గురయ్యాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని పేద ముస్లింలకు పంచాలన్నారు. మైనారిటీల కార్పొరేషన్ల పునరుద్ధరణతో పాటు విద్యకు ఆర్థిక సాయం చేయాలన్నారు.



మాట్లాడుతున్న ముస్లిం మైనారిటీ నాయకుడు మహబూబ్ బాషా

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

నంద్యాల(న్యూటౌన్): మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని డాక్టర్ ఆరీఫాభాను, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి సూచించారు. బుధవారం రామకృష్ణా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, ఉపన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

రైతుల మధ్య ఘర్షణ

శిరివెళ్ల: బోయలకుంట్లలో బుధవారం సాగునీటి విషయంపై ఇద్దరు రైతుల మధ్య ఘర్షణ జరిగిందని ఎస్ఐ సురేష్ తెలిపారు. గ్రామానికి చెందిన నాగమహేష్, శివశంకర్‌ల పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. వరి సాగు చేశారు. నాగమహేష్ పొలంలో ఉన్న నీటి కుంట నుంచి శివశంకర్ కుంట నీటిని తన పొలానికి పెట్టుకుంటున్నాడని కట్టెలతో దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఇరు వర్గాలకు చెందిన 7 మందికి గాయాలయ్యాయి. ఇరు వర్గాల రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

‘కుందూ’కు నీరొచ్చింది



క్రిష్టిపాడులో బ్రిడ్జివద్ద పారుతున్న నీరు

డోర్నిపాడు: రెండు వారాలుగా కుందూనదిలో నీరు పూర్తిగా అడుగంటి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. తాగునీరు, ఇంటి అవసరాలు, పశువులకు నీరు లేక అల్లాడిపోయారు. ప్రస్తుతం నీరు కుందూకు చేరడంతో మండలంలోని క్రిష్టిపాడు, గుండుపాపల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక గ్రామాల్లో నీటి కష్టాలు తీరాయంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శైవక్షేత్రాల వద్ద వైద్య శిబిరాలు

నంద్యాలటౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని శైవక్షేత్రాల వద్ద ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి, వైస్‌చైర్మన్ మారుతీకుమార్ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శ్రీశైలం, యాగంటి, భోగేశ్వరం, ఓంకారం మహానంది క్షేత్రాల్లో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు భక్తులకు వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, వైద్య సేవలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తామన్నారు. సమావేశంలో సొసైటీ ట్రెజరర్ నాగేశ్వరరావు, ఉస్మాన్‌బాషా, నాగేశ్వరరెడ్డి, అమర్‌నాథ్, శ్రీనివాసులు, రాజునాయక్, కృష్ణయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా



రిపోర్టును పరీక్షిస్తున్న డాక్టర్

గోస్పాడు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు పేదలకు భరోసా ఇస్తున్నాయని ఎంపీడీఓ నాగఅనసూయ అన్నారు. మండలంలోని పసురుపాడు గ్రామంలో బుధవారం వైద్యులు గోవర్ధన్‌రెడ్డి, క్రాంతికుమార్, జ్యోతివాణి, మురళీ మనోహర్‌ల ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 425 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గద్దం లలితమ్మ వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



ముస్తాబైన ముత్తలూరు ఆర్‌బీకే



రెడ్డిపల్లెలో నూతనంగా వేసిన సీసీ రోడ్డు

రుద్రవరం: మండలంలోని 26 గ్రామాల్లో పూర్తయిన అభివృద్ధి పనులను గురువారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రారంభించనున్నారని పీఆర్ ఏఈ వెంకటరాముడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు పేరూరులో సీసీ రోడ్లను ప్రారంభిస్తారని, అక్కడి నుంచి ఎర్రగుడిదిన్నె మీదుగా మండలంలోని మరో 24 గ్రామాల్లో నూతనంగా నిర్మించిన తారు రోడ్లు, నూతన గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, సీసీ రోడ్లు, వంతెనలు, కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమి పూజ వంటి అభివృద్ధి పనులను ప్రారంభిస్తారన్నారు.